తగ్గుతున్న టమోటా ధరలు • ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి -సోమల: రోజురో జుకూ టమోటా ధరలు తగ్గుతూ రైతును ఆందోళన కలిగిస్తుండడంతో టమోటా రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. 15 రోజుల క్రితం వరకు 30 కేజీల టమోటా బాక్స్ పుంగనూరు, మదన పల్లి, కలికిరి, పలమనేరు మార్కెట్లలో రూ.900, రూ.1000 , 1200 రూపాయల వరకు ధర పలికింది. ఇటీవల వారం రోజులుగా రూ.600 రూ.500, ఆదివారం 350 రూపాయల ధర పలకడంతో టమోటా రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమల మండలంలో అత్యధికంగా టమోటా సీజన్లో రైతులు టమోటా సాగు చేయడం ఎన్నో ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. సాగు చేసిన రైతులందరికీ పెట్టుబడి రావడం, కొందరికి లాభాలు రావడం ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. ఈ కారణం వల్ల ఈ ఏడాది కూడా మండల రైతులు అధిక శాతం టమోటాను సాగు చేశారు. పుంగనూరు, కలికిరి, పలమనేరు టమోటా మార్కెట్‌లకు తమ సరుకును తరలించి రైతులు అమ్మకాలు సాగిస్తున్నారు. అయితే వారం రోజులుగా టమోటా ధరలు రోజురోజుకూ తగ్గుతూ వుండడంతో రైతులను ఆందోళన కలిగిస్తోంది. పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక నుండి అధిక శాతం టమోటాలు తిరిగి ఈ మార్కెట్లకు రావడంతో ధర తగ్గుతోందని రైతులు అంటున్నారు.

రాజకీయ వేధింపులు మానుకోవాలి..

- 5న ధర్నాను జయప్రదం చేయండి
- సిఐటియు నాయకుల పిలుపు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లాలో స్కీం వర్కర్ల అంగన్‌వాడీ, సంఘమిత్ర, మధ్యాహ్న భోజనం, ఆశ తదితర రంగాల కార్మికులపై రాజకీయ వేధింపులు మానుకోవాలని నిరసిస్తూ ఆగస్టు 5వ తేదీ కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాలో జిల్లాలోని కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే సురేంద్రన్, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు పిలుపు నిచ్చారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే సురేంద్రన్, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ జిల్లాలో కార్మికులపై రాజకీయ వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలే నేడు అధికారంలో వున్న టిడిపి కూటమి ప్రభుత్వం చేస్తూ కార్మికులను తొలగించే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు వచ్చినప్పుడల్లా స్కీం వర్కర్లపై వేధింపులు షరామామూలు అయ్యాయన్నారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు స్కీం వర్కర్లు చేసే పోరాటాలకు మద్దతిస్తున్న వారు అధికారంలోకి రాగానే వారిపై వేధింపులకు పాల్పడడం ఏమిటని ప్రశ్నించారు. స్కీం వర్కర్లపై పాలకులు వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు. స్కీమ్ వర్కర్లకు నిరంతరం అండగా ఉంటున్న సిఐటియు ఆధ్వర్యంలో ఆగస్టు 5వ తేదీ కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపు నిచ్చారు. జిల్లాలో కార్మిక వర్గం సిఐటియుని బలోపేతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు రాజశేఖర్, చిట్టెమ్మ పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీ'జులుం'

- భారీగా వసూలు చేస్తున్న యాజమాన్యాలు
- అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫామ్ విక్రయం
- తల్లిదండ్రుల గగ్గోలు

ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఎంతమంది అధికారులు వచ్చినా.. మధ్యతరగతి ప్రజలకు విద్య మాత్రం ఒక శాపం గానే మారుతోంది. పేదలకు నాణ్యమైన విద్య.. అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది. మొదట్లో మాయ మాటలు చెప్పి పాఠశాలల్లో చేర్పించిన అనంతరం.. జలగల్లా పిల్లల తల్లిదండ్రులను పీక్కు తింటున్నాయి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు. దీంతో మధ్య తరగతి పిల్లల తల్లిదండ్రులకు భారంగా మారి తమ పిల్లలకు విద్యను దూరం చేస్తున్నారు. తమ రెక్కల కష్టాలను దండుకుంటున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యుల పట్ల వీరు తీవ్ర అసంతృప్తిగా వున్నారు.

ప్రజాశక్తి - పూతలపట్టు:

పిల్లలకు మెరుగైన విద్య కోసమో.. లేక ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం వల్లనో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేరుస్తున్నారు. డబ్బున్న వారి మాటలేలా ఉన్నా.. మధ్యతరగతి వర్గాలు సైతం వాటి వైపే మొగ్గ చూపుతున్నారు. వారి బలహీనతనల్ని ఆసరాగా తీసుకుంటున్న ప్రైవేటు యాజమాన్యాలు భారీగా ఫీజులు దండు కుం టున్నాయి. ఈ ఫీజుల భారం భరించలేం.. బాబోయ్ అంటూ గగ్గోలు పెడుతున్న పరిస్థితులు మధ్యతరగతి ప్రజల్లో నెలకొన్నాయి.



మాయ మాటలు చెప్పి..

'తమ పాఠశాలల్లో చేర్పించండి.. విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును ఇస్తాం..' అంటూ ఆకర్షణీయమైన ప్రకటనలతో యాజమాన్యాలు విద్యార్థులను వారి తల్లిదండ్రులను వలలో వేసుకుంటున్నాయి. ఆయా విద్యా సంస్థల ప్రతినిధులు పదేపదే విద్యార్థుల ఇళ్లకు తిరుగుతూ.. తీరిక లేకుండా సెల్‌ఫోన్ల ద్వారా తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి విద్యా వ్యాపారం ముసుగులోకి దింపుతున్నారు. పుస్తకాలు, నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, చివరికి బూట్లు కూడా తామే తక్కువ ధరలకు అందిస్తామంటూ జోరుగా ప్రచారం చేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచిపోతున్నా నేటికీ కొన్ని పాఠశాలల యాజమాన్యాలు తమ పిల్లలను తమ పాఠశాల లోనే చేర్పించాలని హడావుడి చేస్తున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఈ విద్యాసంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 70వేల మంది విద్యార్థులు తగ్గి పోవడానికి ఇదే ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.

డొనేషన్ల పేరుతో..

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా విస్మరిస్తున్నాయి. రెట్టింపు ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం రూ.10,000 నుంచి రూ.20,000 పెంచి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డొనేషన్ల పేరుతో తల్లిదండ్రులను దోచేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో ఉన్న కొన్ని యాజమాన్యాలు మాత్రం ఇష్టానుసారంగా అడ్డు అదుపు లేకుండా పోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సంవత్స రం పొడవునా ఫీజుల రూపంలో ప్రైవేటు స్కూళ్లు రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు కార్పొరేట్ స్కూల్లో లక్షలు దోచుకుంటున్నారు. పుస్తకాలు పేరుతోను దోపిడీ సాగుతోంది. ఎల్కేజీ పిల్లలకు కేవలం పుస్తకాల కోసం రూ.2,500 ముక్కు పిండి వసూలు చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అంచనా వేయవచ్చు.

నియంత్రణ ఏదీ?

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు తమకు నచ్చిన రీతిలో ఫీజులు వసూలు చేస్తున్న నియంత్రణ చేయలేక పోవడం తల్లిదండ్రుల జేబులకు చిల్లు పడు తున్నాయి. మరోవైపు నిబంధనలను ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయి. పదవ తరగతి ఇంటర్ చదివిన వారితో తక్కువ జీతాలు ఇచ్చి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బీఈడీ చేసి శిక్షణ పొందిన వారితో విద్య అందించాలని నిబంధన ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా విద్యార్థులు చదువుల్లో వెనుకబడి పోతున్నారు. వేలకు వేలు ఫీజులు కట్టినా ఫలితం మాత్రం రావడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారు

ప్రైవేటు పాఠశాలలు పుస్తకాల పేరుతో అధిక ఫీజులు వసూలు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారు.. దీంతో విద్యార్థులు మానసికంగా వేదనకు గురవు తున్నారు.. కొన్ని పాఠశాలల్లో కేవలం పుస్తకాలు మూడో తరగతి, నాలుగో తరగతి విద్యార్థుల వద్ద నుంచి రూ.5 వేలు వసూలు చేయడం దారుణం. వీటిపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలి.

- వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి.

శృతి మించుతున్న ఆగడాలు

- ప్రహరీ కూల్చివేత
- రూ.13 లక్షలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి -పుంగనూరు : 'మేము టిడిపి వాళ్లం' అంటూ అడ్డు అదుపు లేకుండా సాగిస్తున్న విధ్వంసాలు శృతి మించుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. అందుకు నిదర్శనం శనివారం రాత్రి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి పక్కా డాక్యుమెంట్లతో కొనుగోలు చేసిన స్థలంపై కూడా కన్ను వేశారు. రాంపల్లి సమీపంలో ఉన్న 4.90 ఎకరాల స్థలంలో రూ.13 లక్షలు ఖర్చుపెట్టి నిర్మించుకున్న ప్రహరీని కూల్చి వేశారు. రాంపల్లి సమీపంలో 4.90 ఎకరాల స్థలాన్ని బత్తలాపురం రమణ 2023 సంవత్సరంలో కొనుగోలు చేశారు. ఈ భూమిలో2.25 ఎకరాలు పూజగనిపల్లి గ్రామానికి చెందిన శాంత కుమార్, ఎం రవి, ఎం ప్రదీప్ లకు భాగం వుందని లింగోల నవీన్ కుమార్ యాదవ్ సహకారంతో వెళ్లి దౌర్జన్యం చేసి4.90 ఎకరాల మేర వున్న మొత్తం ప్రహరీని కూల్చి వేశారు. టిడిపి పేరు చెప్పుకొని విధ్వంసాలకు పాల్పడుతున్నారని బాధితుడు రమణ తెలిపారు. కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ను కూడా లెక్కచేయకుండా ప్రహరీ గోడ కూల్చివేయడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. అధికార పార్టీ ఆగడాలు పరాకాష్టకు చేరుకున్నాయని బహిరంగ విమర్శలు ఉన్నాయి. ఈ సంఘటనపై రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొనసాగుతున్న సోదాలు

- ఒక్కొక్కటిగా బయటపడుతున్న వైసిపి నేతల బాగోతాలు
- తాజాగా మాజీ ఎమ్మెల్యే ఇంట్లో రెవెన్యూ, పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో దస్త్రాల దహనం ఘటన కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. తాజాగా మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో సోదాలు చేపట్టేందుకు ఆదివారం ఉదయం ఆయన ఇంటికి పోలీసులు వెళ్లారు. ఇంటికి తాళాలు వేసి ఉండటాన్ని గమనించి ఫోన్ ద్వారా సంప్రదించి సమాచారం అందించారు. తన కుటుంబ సభ్యులతో సహా బెంగళూరు వెళ్లానని సాయంత్రానికల్లా మదనపల్లెకు చేరుకుని ఏ విషయంలో నైనా మీకు సహకరిస్తానని చెప్పడంతో సాయంత్రం వరకు వేచి చూశారు. సాయంత్రం మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా స్వగృహానికి రావడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం ఆయన ఇంట్లో వివిధ రికార్డులను పరిశీలించి, తనిఖీలు చేపట్టారు. కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులను లోనికి అనుమతించకుండా బయటే నిలిపివేశారు. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా పై పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలినాళ్లలోనే విలువైన భూములపై కన్నేసి, కొన్ని భూములను హస్తగతం చేసుకున్నాడని, ముఖ్యంగా వక్ఫ్ భూములను సైతం కొన్నింటిని పేర్లు మార్చి తన బినామీ పేర్లమీద రిజిస్టర్ చేయించుకున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఇవే కాకుండా 22-ఎ భూముల పైన కన్నేసిన మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ భూములు, నిషేధిత, డీకేటి భూములను సైతం ఆక్రమించుకుని తన అనుచరులతో భారీ వెంచర్లు వేసినట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. ఇదిలా ఉండగా వైసిపి ప్రభుత్వంలో వలసపల్లి పంచాయతీలో లారీ అసోసియేషన్ పేరుతో సుమారు 8 ఎకరాలకు పైగా 200 కోట్ల విలువ చేసే భూములను కాజేసేందుకు యత్నించి, తనకు అనుకూలమైన రెవెన్యూ అధికారులను నియమించుకుని ఆ దిశగా ఫైళ్లు మూవ్ చేసి, ఇప్పటికే ఆ భూములను హస్తగతం చేసుకున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. మరో వైసిపి నాయకులు బాబ్జాన్ అందుబాటులో లేకపోవడంతో అతని కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. పెద్ద ఎత్తున భూ ఆక్రమణల వెనుక అసలు సూత్రధారి ఎవరు అన్నది తెలియాల్సి వుంది. ఇప్పటికే సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు స్వీకరించిన సిసోడియాకు బాధితులు 400 కు పైగా అర్జీలను నేరుగా ఆయనకే చేర్చారు. తర్వాత రెండు రోజులు మరో వంద మంది బాధితులు అర్జీలను సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేర్చారు. అన్ని అర్జీలలోను గత వైసిపి ప్రభుత్వ హయాంలో తమ భూములను బలవంతంగా లాక్కున్నారని, ఆక్రమించు కున్నారని, దౌర్జన్యం చేసి కబ్జాలు చేశారని వైసిపి నేతలు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి అను చరులపైన ఆరోపణలు గుప్పిస్తూ అర్జీలు ఇచ్చినట్లు స్వయంగా విచార ణాధికారి, రెవెన్యూ చీఫ్ సెక్రటరీ సిసోడియానే ప్రకటించడం గమనార్హం. దీంతో పోలీసులు వరుసగా వైసిపి నేతల ఇళ్లల్లో సోదాలను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన ముగించు కొని నేడు రాష్ట్రానికి చేరుకోనున్న నేపథ్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయ ఘటన కేసులో కీలకమైన పరిణామాలు చోటు చేసుకునే అవకాశాలు కనబడు తున్నాయి.

మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంటి వద్ద పోలీసుల బందోబస్తు

తంబళ్లపల్లె ఎమ్మెల్యే ఇంట్లోనూ పోలీసుల సోదాలు

తంబళ్లపల్లె ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోదరుడు ద్వారకనాథరెడ్డి స్వగృహం తంబళ్లపల్లెలో శనివారం రాత్రి, ఆదివారం పగలు సోదాలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో ఉన్న ఆయన కార్యాలయాల్లో, ముఖ్య అనుచరుల ఇళ్లల్లో సైతం సోదాలు చేసినట్లు సమాచారం.

దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలి

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

మదనపల్లె రెవెన్యూ డివిజన్ లోని 11 మండలాలకు చెందిన వేల ఎకరాల భూములకు చెందిన రికార్డులను నిర్వహించే సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని దహనం చేసిన నిందితులను ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటనను పూర్తిగా ఖండిస్తున్నానన్నారు. గతంలో అడంగల్, జమాబందీ నిర్వహించేవారని ప్రస్తుతం ఇవి ఇప్పుడే మయ్యా యని ప్రశ్నించారు. లెక్కలు మాయం చేశారు. రెవిన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఘటన జరిగిన నాటి నుండి నేటి వరకు సిఐడి అధికారులు, పోలీసు అధికారులు దర్యాప్తు చేస్తున్న తీరు అభినందనీ యమన్నారు. దోషులెంతటివారైనా వదొలద్దని, వారిని ఖచ్చితంగా శిక్షించాలని కోరారు.

కామెర్లు ప్రాణాంతక వైరస్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ప్రభావతి దేవి

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్: కామెర్లు ప్రాణాంతకమని, ఆ వ్యాధి బారిన పడ కుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ప్రభావతి దేవి పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ హెపటైటిస్ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలకు జిల్లా వైద్యాధికారిణి ఆరోగ్య సూచనలు తెలిపారు. హెపటైటిస (కామెర్లు) ఒక ప్రాణాంతక వైరల్ అంటు వ్యాధి హెపటైటిస్ చాలా ప్రమాదకరమైందని, కాలేయ సంబంధిత వైరల్ అంటు వ్యాధి అని, ఇది నాలుగు రకాల హెపటైటిస్ వ్యాధి అన్నారు. సుభ్రతలేని ఆహారం, నీటి వల్ల, కలుషితమైన రక్తం ద్వారా వ్యాధి ఇతరులకు సోకు తుందన్నారు. వీటిలో కొన్ని మందులతో నివారించ వచ్చని, వ్యాధిగ్రస్తుని శరీరంలో రక్తం, మూత్రం, వీర్యం ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుందని, నిర్మూలన దిశగా ఉచిత రక్త పరీక్షల ద్వారా నిర్ధారించుకొని చికిత్స పొంది 2030 నాటికి హెపటైటిస్ రహిత సమాజానికి అందరూ సహకరించాలని కోరారు. హెపటైటిస్ బి చాలా ప్రమాదకరమైందని, వ్యాధి నియంత్రణలో భాగంగా శిశువులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో హెపటిటీస్ బి వాక్సిన్ ఇస్తున్నామని తెలిపారు. ప్రజలు సూచనలు తప్పక పాటించడం ద్వారా 2030 నాటికి హెపటైటిస్ లేని సమాజ స్థాపన సాధ్యమవుతుందని తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్:

చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం సోమవారం ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్ లోని నూతన సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

తిరుమల కాలినడకన పాము కలకలం

కాటుకు గురైన భక్తుడు

ప్రజాశక్తి- తిరుమల:

తిరుమల నడక మార్గంలో వెళ్తున్న ఓ భక్తుడిని పాము కాటేసిన ఘటన కలకలం సష్టించింది. శ్రీవారి దర్శనానికి నడక మార్గంలో వెళ్తున్న ఓ భక్తుడిని శనివారం పాము కాటేసింది. చీరాలకు చెందిన కొంతమంది భక్తులు అలిపిరి మెట్ల మార్గం గుండా తిరుమలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఏడో మైలు వద్దకు రాగానే సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి మెట్లపైకి చేరుకున్న పాము, మెట్లపై విశ్రాంతి తీసుకుంటున్న నాగేంద్ర అనే భక్తుడిని కాటేసింది. దీంతో శ్రీవారి భక్తులంతా ఒక్కసారిగా భయంతో హాహాకారాలు చేశారు. భక్తుల సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న టీటీడీ, అటవీ సిబ్బంది పాము కాటుకు గురైన యువకుడిని తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. అక్కడే యువకుడు చికిత్స పొందుతున్నారు. యువకుడిని కాటేసిన పాము విషపూరితమైనది కాకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రస్తుతం అతని ప్రాణాలకు ఎలాంటి అపాయం లేదని వైద్యులు తెలిపారు.

చేతగాని ప్రభుత్వం..!

- పేరుకే కూటమి అధికారం..
- పోలీసు వ్యవస్థ మొత్తం వైసీపీ కనుసన్నల్లోనే..
- బీసీవై అధినేత రామచంద్ర యాదవ్ ఘాటు విమర్శ

ప్రజాశక్తి -పుంగనూరు: 'రాష్ట్రంలో పేరుకి మాత్రమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలో వుంది.. కానీ ఇప్పటికీ పోలీసు వ్యవస్థ సహా కీలక వ్యవస్థలు వైసీపీ కనుసన్నల్లోనే ఉన్నాయి..' అని బీసీ యువజన పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ శనివారం విమర్శించారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే రాష్ట్రంలో జగన్ సీఎంగా, వైసీపీ అధికారంలో ఉన్నట్టు కనిపిస్తోందనీ, రాష్ట్రంలో ఏమైనా లోపాయికారీ ఒప్పందాలు, రాజకీయాలు జరుగుతున్నాయా? అనే అనుమానాలు ఉన్నాయని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇవిగో కీలక ఉదాహరణలు..!

307 (హత్యాయత్నం) కేసులో నిందితుడుగా వున్న వైసీపీ నుండి పోటీ చేసిన అభ్యర్థిని బెంగుళూరు ఎయిర్‌పోర్టు అధికారులు పట్టుకుని ఆంధ్ర పోలీసులకి అప్పగిస్తే 41 నోటీసు ఇచ్చి పెళ్లి కొడుకుని సాగనంపినట్లు పంపారన్నారు. ఈ మాత్రానికి ఇంత హడావిడి, హంగామా అవసరమా?' అంటూ దుయ్యబట్టారు.. 'పుంగనూరులో పది రోజుల క్రితం ఇరు గ్రూపుల మధ్య జరిగిన గొడవల్లో ఎంపీ మిథున్ రెడ్డి సహా మాజీ ఎంపీ రెడ్డప్ప తదితరులపై 307 కేసులు నమోదైనా ఇప్పటికీ అరెస్టులు చేయలేదన్నారు. 'అంగళ్లు అల్లర్లలో చంద్రబాబుతో పాటు ఆ పార్టీకి చెందిన వందలాది కార్యకర్తలపై అక్రమంగా 307 కేసులు పెట్టి వేధించినా అప్పటి అన్నమయ్య జిల్లా ఎస్పి గంగాధర్ ను కృష్ణ జిల్లాకు ఎస్పీగా పోస్టింగ్ ఇవ్వగా.. ఆయన అక్కడ వైసీపీ మాజీ మంత్రి కొడాలితో కలిసి టీడీపీకి వ్యతిరేకంగా పని చేస్తున్నా.. ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని రామచంద్ర యాదవ్ తెలిపారు. 'పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి కుటుంబానికి చెంచాగిరి చేసిన పోలీసు అధికారులని పలమనేరులో కీలక పోస్టింగ్స్ లో నియమించిన స్థానిక ఎమ్మెల్యే ఒకరు ఉండగా.. మదనపల్లి సబ్ కలెక్టర్ ఆఫీస్ లో ఫైల్స్ దహనం కేసులో ప్రధాన నిందితుడిని పెళ్లి కొడుకుని పంపినట్లు ఢిల్లీకి సాగనంపింది స్థానిక పోలీసులేనని.. దీనిపై ప్రభుత్వం నిద్ర పోతోందా?' అని ప్రశ్నించారు. ఇలా రాష్ట్రంలో అనేక సంఘటనలు చూస్తుంటే పోలీసు వ్యవస్థలో వైసీపీ కి వున్న పట్టు అర్థమవుతోంది. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే తొందర్లోనే పెద్దిరెడ్డి కుటుంబానికి చెంచాగిరి చేసి వేల మందిపై అక్రమ కేసులు పెట్టి వేధించిన రిషాంత్ రెడ్డి, అమ్మిరెడ్డి లాంటి అధికారులకు ప్రమోషన్ ఇచ్చి కీలకమైన పోస్టింగ్స్ ఇచ్చే అవకాశం వుంది..' అనే అనుమానాలు వ్యక్తం చేశారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అవినీతి, అరాచకాలు చేసిన అధికారులను 'మీరు ఇలా అందలం ఎక్కిస్తుంటే.. మీ హయాంలో కూడా ప్రోత్సహిస్తుంటే.. నిజాయతీగల అధికారుల ఆత్మస్థైర్యం దెబ్బతీయడంతో పాటూ ప్రజల్లోనూ తప్పుడు సంకేతాలు వెళుతున్నాయన్నారు. ప్రభుత్వ పెద్దలు ఈ వ్యవహారంలో పునరాలోచన చేయాలని బీసీవై పార్టీ తరపున కోరుతున్నామని, దీనిపై సమీక్ష చేసుకొని, సరిదిద్దకపోతే ఈ వ్యవహారం, ఈ ఘటనలు రాష్ట్రంలో అరాచక అధికారులకు టీడీపీ కొమ్ముకాస్తున్నట్లు కనిపిస్తోందనీ, ఓ విధంగా ఏమైనా లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయా? అనే అనుమానాలు సాధారణ ప్రజల్లోనూ కలుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

15 నుంచి బిఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెరిగిన వినియోగదారులు
- తక్కువ ధర.. ఎక్కువ సేవలు
- 'ప్రజాశక్తి'తో బిఎస్ఎన్ఎల్ జిఎం సి అమరేంద్ర రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు.. మూలనపడ్డ సంస్థలు అప్పుడప్పుడు తెరుచు కుంటాయి.. మూతపడుతా యనుకున్న సంస్థలు ట్రెండింగ్‌లోకి వస్తాయి.. నిన్నా.. మొన్నటి వరకూ బిఎస్ఎన్ఎల్ అంటేనే ఆసక్తి లేని మొబైల్ కస్టమర్లు.. ఇప్పుడు అదే బిఎస్ఎన్ఎల్ వైపు ఆసక్తి గా ఎదురుచూస్తున్నారు. రీజన్ ఒక్కటే కాస్ట్ తగ్గింది.. కస్టమర్లు అట్రాక్ట్ అవుతున్నారు.. సిగ్నల్, డేటా స్పీడ్ ఉండదన్న కారణంతో గతంలో బిఎస్ఎన్ఎల్ అంటేనే ఇష్టపడని కస్టమర్లు ఇప్పుడు మళ్లీ ఆ నెట్‌వర్క్‌కే తమ సిమ్‌లను పోర్ట్ చేసుకుంటున్నారు. లక్షల మంది కస్టమర్లు మళ్లీ బిఎస్ఎన్ఎల్‌ను ఎంచుకుంటున్నారు. కొత్తగా బిఎస్ఎన్ఎల్ సిమ్ము తీసుకునేవాళ్లు కొందరైతే.. జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా నుంచి కన్వర్ట్ అవుతోన్న కస్టమర్లు లక్షలమంది ఉన్నారు. బిఎస్ఎన్ఎల్ 4జీ సేవలను కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి ప్రారంభించనుంది. దీంతో పాటు చిత్తూరు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు వినియోగదారులకు అందు తున్నాయని, అయితే తిరుపతి తిరుమలలో ఆగస్టు 15 నుంచి బిఎస్ఎన్ఎల్ సేవలు అందు బాటులో వస్తాయని తిరుపతి జిల్లా బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ సి.అమరేంద్ర రెడ్డి 'ప్రజాశక్తి'కి తెలిపారు. ప్రైవేట్ కంపెనీలు వారివారి సేవలను ధరలు పెంచి వేయడంతో చాలామంది బిఎస్ఎన్ ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. చిత్తూరు జిల్లా పరిధిలో కేవలం 20రోజుల్లో 3200 మంది ఇతర నెట్వర్క్ సర్వీస్ ఉన్నవారు బిఎస్ఎన్ఎల్‌కు పోర్టు పెట్టుకున్నారన్నారు. వారందరూ బిఎస్ఎన్ఎల్ సిమ్ కార్డు కొనుగోలు కోసం భారీ ఎత్తున వినియోగదారులు వస్తున్నారని చెప్పారు. చిత్తూరు జిల్లాలో 3,25,000 మంది బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు కలిగి ఉన్నారని, ఇప్పుడు వారి సంఖ్య మరింత పెరిగిం ద న్నారు. రానున్న రోజు ల్లో మరింత బిఎస్ఎన్ ఎల్ సిమ్ కార్డులు తీసుకునే అవకాశం ఉందన్నారు. మారుమూల గ్రామాల్లో ప్రైవేటు నెట్‌వర్క్ ఇవ్వలేని సేవలు బిఎస్ఎన్ఎల్ సేవలు అందిస్తుందన్నారు.

బిఎస్ఎన్ఎల్ జిఎం సి.అమరేంద్ర రెడ్డి

ప్రజాశక్తి: 4జీ సేవలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయి?

బిఎస్ఎన్ఎల్ జిఎం: చిత్తూరు జిల్లాలో ఆగస్టు 15 నుంచి దేశ వ్యాప్తంగా 4జి సేవలు కేంద్ర ప్రభుత్వం ప్రారంభిస్తుంది. చిత్తూరు జిల్లాలో అదేరోజు బిఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంభిస్తాం. ఇందులో తిరుపతితో పాటు తిరుమలలో 4జి సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ప్రజాశక్తి: 4జి టవర్లు అందుబాటులో ఉన్నాయా?

బిఎస్ఎన్ఎల్ జిఎం: చిత్తూరు జిల్లాలో 406 లొకేషన్ కేంద్రాలు ఉన్నాయి. అందులో 120 టవర్లు గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో ఉన్నాయి. 4జి టవర్లు 74 ఉన్నాయి. తిరుపతిలో 60 టవర్లు తిరుమలలో 10 టవర్లు కలిగి ఉన్నాయి. ఈ4జి సేవలు అందిస్తాయి. తిరుపతిలో మరో 70 టవర్లు పెట్టడానికి ప్రాంతాలను పరిశీలిస్తున్నాం.

ప్రజాశక్తి: బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల సంఖ్య ఎంతవరకు పెరిగింది?

ఇంటర్వ్యూ

బిఎస్ఎన్ఎల్ జిఎం: చిత్తూరు జిల్లాలో 19 రోజుల్లో పదివేల మందికి కొత్త సిమ్ కార్డులు ఇచ్చాము. ప్రైవేట్ ఆపరేటర్లు రీఛార్జ్ ధరలు పెంచడం వల్ల చాలా మంది బిఎస్ఎన్ఎల్ 4జీ సేవల కోసం తమ సిమ్ కార్డులను తీసుకోవడానికి ఎగబడు తున్నారు. వినియోగదారుల్లో ఆదరణ పెరిగింది.

ప్రజాశక్తి: బిఎస్ఎన్ఎల్ ల్యాండ్ లైన్ ఫోన్లు తగ్గడానికి కారణం ఏమిటి?

బిఎస్ఎన్ఎల్ జిఎం: బిఎస్ఎన్ఎల్ ల్యాండ్ లైన్ తగ్గడానికి కారణం 2జి, 3జి, 4జి సేవలు రావడం ఓ కారణం. గతంలో 30 వేల ల్యాండ్ లైన్ ఫోన్లు ఉంటే, ప్రస్తుతం 4వేల ల్యాండ్ లైన్ ఫోన్లు ఉన్నాయి. ల్యాండ్ లైన్ తగ్గడానికి కారణం వినియోగదారులు ఆదరణ బట్టి ఉంటుంది.

ప్రజాశక్తి: బిఎస్ఎన్ఎల్ సేవల్లో అంతరాయం కలగడానికి కారణం ఏంటి?

బిఎస్ఎన్ఎల్ జిఎం: బిఎస్ఎన్ఎల్ సేవలు అప్పుడప్పుడు కొన్ని సందర్భాల్లో అంతరాయం కలగడానికి కారణం శ్రీకాళహస్తి, చెన్నై , పుత్తూరు, వీకోట వంటి ప్రాంతాల్లో గ్యాస్ పైప్ లైన్లు పనులు జరుగుతుండడంతో బిఎస్ఎన్ఎల్ కేబుల్ తెగిపోయి సేవలకు అంతరాయం కలుగుతోంది. వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పనులు చేస్తున్నాం.

ప్రజాశక్తి: బిఎస్ఎన్ఎల్ వాట్సాప్ నెంబర్ ఎలాంటి ఉపయోగం ఉంది.

బిఎస్ఎన్ఎల్ జిఎం: బిఎస్ఎన్ఎల్ ఫైబర్ సొల్యూషన్ కావాలంటే వాట్సాప్ నెంబర్ 1800 4444 తెలియజేయాలి. బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఈ నంబర్‌ను డౌన్లోడ్ చేసుకుంటే ఉపయోగం ఉంటుంది.

వీధి దీపాలు ఏర్పాటు

వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి లలిత

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం అన్నెమ్మ గారి పల్లిలో వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి లలిత తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ పరిధిలో అక్కడక్కడా వీధి దీపాలు వెలగక పోవడంతో నూతన వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలోని అనేక గ్రామాలలో మురుగునీటి కాలువలను శుభ్రం చేశామని, పిచ్చి మొక్క లు తొలగిస్తున్నామన్నారు. ప్రజలకు అంటువ్యాధుల వల్ల కలిగే నష్టాల గురించి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

నేడు పెద్ద ఉప్పరపల్లి గంగ జాతర

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం పెద్ద ఉప్పరపల్లిలో సోమవారం గంగ జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆదివారం సాయంత్రం అమ్మవారిని దిగువ వీధిలో ప్రతిష్టించి సోమవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక నైవేద్యం, పొంగళ్లు సమర్పించి సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించి జలాధివాసం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గంగ జాతర కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వారు తెలిపారు.

సదుంలో ఆడికృత్తిక మహోత్సవాలు

ప్రజాశక్తి-సదుం: మండలంలోని గార్గేయ నది వడ్డున వెలిసిన శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యం స్వామి దేవాలయంలో "ఆడి కృత్తిక మహోత్సవాలు" ఆదివారం నుంచి 1వ తేది వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ధ్వజారోహణ అంగరంగ వైభవంగా జరిగింది.

ఆకట్టుకున్న దుర్యోధన వధ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో జరుగుతున్న వార్షిక మహాభారత మహోత్సవంలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి వైసీపీ నాయకులు నరేష్ రెడ్డి, సురేష్ రెడ్డిల కుటుంబ సభ్యులు ఉభయదారులకు వ్యవహరించారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఐటీఐ కళాశాల చుట్టూ వర్షపు నీరు

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటిఐ కళాశాల చుట్టు వర్షపు నిలిచి కదలడం లేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిలిచి ఉన్న వర్షపు నీటి నుంచి దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించి గ్రావెల్ నింపి గుంతలు పూడ్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

హైకోర్టు న్యాయవాదికి ఘన సన్మానం

ప్రజాశక్తి-రామకుప్పం: రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది శరత్ కుమార్‌ను రాష్ట్ర టిడిపి నేత మునస్వామి, ఇతర నేతలు ఆయనను ఘనంగా సన్మానించారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో శరత్‌కుమార్‌ను గుర్తించి ప్రభుత్వ అడ్వకేట్‌గా గుర్తించడం శుభ పరిణామం ఉన్నారు. ప్రభుత్వ ఆస్తులు పరిరక్షించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జయశంకర్, సత్తి, మహేంద్ర నాయుడు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-సోమల: చౌడేపల్లి మండలంలోని రెండు వేర్వేరు ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. చౌడేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1965-66 ఎస్ఎస్ఎల్‌సీ బ్యాచ్ అపూర్వ కలయిక ఆనందోత్సాహాల మధ్య ఆదివారం జరిగింది. వృద్ధాప్యం లో నడవలేక, సరిగా చూపు కనబడక, కళ్ళద్దాలను సరిచేసుకుంటూ, ఒకరినొకరు గుర్తుపట్టుకొని, నాటి కొంటె పనులను మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, తమ జీవన శైలిని ఒకరికొకరు ముచ్చటించుకుంటూ గడిపారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని సంతోషంగా గడిపారు. అలాగే మండలంలోని మేకలచిన్నేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన 2005-06 పదవ తరగతి పూర్వ విద్యార్థులు అందరూ పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయానురాగాలతో పిలుచుకొని క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు.

నరసింహులురెడ్డికి నివాళి

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని కాళికాపురం పంచాయతీకి చెందిన వైసీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి తండ్రి నరసింహులు రెడ్డి ఆనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి, నాయకులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు పాండియన్, గౌతమ్, వినోద్‌కుమార్, ముత్తప్పరెడ్డి, ఉప సర్పంచ్ జీ.రవి, యుగేందర్, కృష్ణమూర్తి ఉన్నారు.

వేగం కంటే ప్రాణం ముఖ్యం

ప్రజాశక్తి-విజయపురం: వేగం కంటే ప్రాణం ముఖ్యమని ఎస్ఐ జయప్ప అన్నారు. ఆదివారం పన్నూరు సబ్‌స్టేషన్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కారు, ఆటో, స్కూటర్‌లను క్షుణంగా పరిశీలించారు. సీటు బెల్ట్, హెల్మెట్ లేకుండ వాహనం నడపకూడాదని సూచించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించకూడదన్నారు. అతి వేగం కారణంగా తరచూ రోడ్డు ప్రమాదం జరుగుతున్నాయని గుర్తు చేశారు. రోడ్డు నిబంధనలను పాటించడంతో పాటు వాహనానికి సంబంధించిన రికార్డు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే మద్యం సేవించి, లైసెన్స్ లేకుండ, మైనార్‌లకు బండి ఇచ్చినా కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో భరణి కావడి

ప్రజాశక్తి-విజయపురం: మండలంలో భక్తి శ్రద్ధలతో భక్తులు సుబ్రహ్మణ్యం స్వామికి ఆదివారం కావడి తీశారు. మండలంలోని కళియంబాకం, పన్నూరు, ఆమగుంట, తెల్లగుంట, విజయపురం, ఎం.అగరం, కేవీపురం, కాళికాపురం, ఆలపాకం గ్రామాల్లో కావడి తీశారు. భక్తులు రామగిరి, తిరుత్తణి సుబ్రహ్మణ్యంస్వామి ఆలయాలకు భక్తులు తరలి వెళ్లారు.

వైష్ణవీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-సోమల:

చౌడేపల్లి మండలంలోని పుదిపట్లలో వెలసివున్న వైష్ణవీ దేవి ఆలయంలో ఆషాడమాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకురాలు శ్రావణి ఉదయాన్నే ఆలయంలోని ఆంజనేయ స్వామి వారిని, వైష్ణవి దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకాలు చేశారు. అశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత వినోద్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు ప్రభాకర్‌రాజు మృతి

ప్రజాశక్తి-విజయపురం:

మండలంలోని జగన్నాథపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు ప్రభాకర్రాజు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన టీడీపీ అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేసి, గ్రామంలో పార్టీ పటిష్టతకు కృషి చేశారు. ఆయన మృత దేహానికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిది చినబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. మండల టీడీపీ నాయకులు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

పాయలగుట్ట..సమస్యల తిష్ట..

- బోరు బావిలో అడుగంటిన భూగర్భ జలాలు
- అలంకార ప్రాయంగా ట్యాంకు
- సిమెంటు రోడ్లు, వీధి కాలువలు కరువు
- వున్న పది కుటుంబాలూ కూలీలే.. సెంటు భూమిలేని వైనం
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పాయలగుట్ట గ్రామంలో సమస్యలు తిష్ట వేశాయి. దీంతో గ్రామస్తులు పలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. గ్రామంలో పది కుటుంబాలు, దాదాపు 25 మంది జనాభా ఉన్నారు. గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే బోరు బావిలో నీరు అడుగంటి పోయింది. రెండు నెలలుగా తాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో బోరు బావిలో నీరు పుష్కలంగా వచ్చేవని నీటిని ట్యాంకు ద్వారా సరఫరా చేసి ట్యాంకు నుండి ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా నీటిని పట్టుకునే వారమని రెండు నెలల క్రితం బోరులో నీరు తగ్గి గ్రామానికి చాలడం లేదని నీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి రోజువారి కూలీలుగా జీవనం సాగిస్తున్న తమకు సెంటు భూమినైనా ఇప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామం మొత్తం పది ఇళ్లు వున్నాయి. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా వున్న సమయంలో తమకు ఇళ్లు మంజూరు అయ్యాయని గృహాలు కట్టిస్తామని గుత్తేదారుడు బిల్లులు మాత్రం చేసుకొని ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయకుండా అసంపూర్తిగా చేసి వెళ్లి పోయాడని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం వర్షం వస్తే ఇళ్లు మొత్తం ఉరుస్తోందని ఇంట్లో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. మరుగుదొడ్లు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఇంట్లో చూసినా అసంపూర్తి పనులేనని గోడలు కట్టి పైన బండలు పరిచి తరువాత ఇటు వైపు కన్నెత్తి కూడా చూడలేదని తాము ఇళ్లకు మరమ్మతులు చేసుకుందామన్నా రోజువారి కూలీ పనులు చేసుకుని ఏ పూటకి ఆ పూట గంజి తాగి జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఒక్క సెంటు వ్యవసాయ భూమి కూడా లేదని ప్రభుత్వం పేదలకు ఎస్టీలకు ఉచితంగా వ్యవసాయ భూమి అందిస్తామన్న హామీలు ఏమయ్యాయో అర్థం కావడం లేదని అయోమయంతో తెలిపారు. గ్రామంలో వికలాంగురాలు సుభద్ర వుందని ఆమెకు పింఛను అందడం లేదని, రాజమ్మ అనే మూగ అమ్మాయికి పింఛను అందడం లేదని తెలిపారు. నాయకులు ఎన్నికల సమయంలో రావడం హామీలు ఇవ్వడం ఓట్లు వేయించుకోవడం తప్ప ఇన్ని సంవత్సరాలుగా ఒక్కరూ తమ గ్రామ అభివృద్ధి కోసం కృషి చేయలేదని 'ప్రజాశక్తి' చొరవతో తమ గ్రామాన్ని అభివృద్ధి చేస్తే తాము ఎంతో రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

ఇటీవల కాలంలో ఏనుగుల సంచారం అధికం కావడం తమ గ్రామం సమీపం నుండి వెళుతూ ఉండడం వల్ల తాము ఎప్పుడు ఏ నిమిషంలో ఏ ముప్పు ఎదురవుతుందో తెలియక భయాందోళనతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నామన్నారు. గ్రామం మొత్తం గిరిజనులమే వున్నామని తెలిపారు.

తాగునీటిని సరఫరా చేసే బోరుబావి ప్రైవేటు వ్యక్తుల వ్యవసాయ పొలంలో వేయడం వల్ల ఆయన భూమిలో పంట పండిస్తే తాము బోరు బావి వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకోవాలన్నా పొలంపై నడిచి వెళ్లొద్దని భూయజమాని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని నూతన బోరును తమ గ్రామంలో ఏర్పాటు చేసి ఇంటింటికీ తాగునీరు అందించి తమకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

గ్రామంలో అసంపూర్తి గోడలతోవున్న గృహాలు

వీధి లైట్లు లేవు..

గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో వీధిలోకి రావాలంటే విష సర్పాలు, ఇతర విష కీటకాలతో ఇబ్బందులు పడుతున్నాం.. వీధి దీపాలు ఏర్పాటు చేయాలి..

- కుమారి, పాయలగుట్ట.

దారి సౌకర్యం కల్పించాలి

మా గ్రామానికి రావడా నికి దారి సౌకర్యం లేదు. సిమెంటు రోడ్లు, మురుగు నీటి కాలువలు లేవు. సమస్యలతో ఎన్నో ఏళ్లు కొట్టుమిట్టాడుతున్నాం.

- లక్ష్మీ, ప్రసాద్ దంపతులు, పాయలగుట్ట.

తాగునీటికి ఇబ్బందులు

తాగునీటికి పలు ఇబ్బందులు పడుతున్నాం..గతంలో బోరు బావిలో పుష్కలంగా వచ్చేవి. అధికారులు పట్టించుకుని వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరిం చాలి..

- ఆనందమ్మ, పాయలగుట్ట.

నాయకులు స్పందించడం లేదు...

నాయకులు ఎన్నికల సమయంలో వచ్చి రెండు రోజుల్లో ఇసుక, కంకర సిమెంటు తెప్పించి సిమెంటు రోడ్డు వేస్తామని చెప్పి వెళ్లారు.. రోజులు గడుస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు.

- ఈశ్వరమ్మ, పాయలగుట్ట.

పరమాలలో వైభవంగా దుర్యోధన వధ

ప్రజాశక్తి-రామచంద్రపురం(తిరుపతి రూరల్):

తిరుపతి రూరల్ మండలం పరమాల, పేరూరు గ్రామాలలో శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి మహాభారత ఉత్స వాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వద వైభవంగా జరిగింది. ఆదివారం శ్రీ ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం పి.అశోక్ భీముని పాత్ర, కిరణ్ దుర్యోధన పాత్రల వేషధారణలలో అలంకరించారు. మంగళ వాయిద్యాలు, తపాకాయల పేలుస్తూ

దుర్యోధనుడిని భీముడు తరుముకొంటూ దుర్యోధుని మట్టి ప్రతిమ వద్దకు లాక్కుని వచ్చాడు. మహాభారత యుద్ధంలో ఓడిపోయిన దుర్యోధను గంగ మడుగులో దాక్కుని ఉండగా భీముడు దుర్యోధనుడుతో యుద్ధం చేసి వధించిన ఘటం ప్రేక్షకులను అలరింపజేసింది. ఈ దుర్యోధన పౌరాణిక ఘట్టాన్ని తిలకించడం కోసం వివిధ ప్రాంతాల నుంచి ప్రేక్షకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మహాభారత ఉత్సవాలు ముగింపు సందర్భంగా సాయంత్రం 6గంటలకు అగ్నిగుండా ప్రవేశ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. పేరూరులో వైభవంగా జరుగుతున్న మహాభారతం ఉత్సవాలకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పట్టు వస్త్రాలు సమర్పించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

- మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక తిరుపతి రోడ్డులో రోడ్లపై అక్రమంగా బంకులు ఏర్పాటు చేసుకొని ఇబ్బంది కలిగిస్తున్న వారిని హెచ్చరించారు. అక్కడ పారిశుద్ధ్యంపై ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని పలు చోట్ల కూరగాయల మార్కెట్, అంబేద్కర్ విగ్రహ కూడలి, ప్రభుత్వాసుపత్రి, టీబి రోడ్లలో పర్యటించారు. కూరగాయల వ్యాపారులు, వర్తకదారులు చెత్తను విధిగా సంబంధిత చెత్తబుట్టలో మాత్రమే వేయాలని రోడ్లపై పడేయరాదని వారికి సూచించారు. మురుగునీటి కాలువలలో పూడికతీత పనులు పరిశీలించి దోమల నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఇంద్ర, పారిశుధ్య కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

మహనీయుల పేర్లతో ప్రభుత్వ పథకాలు హర్షణీయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

భావి తరాలకు స్ఫూర్తిని అందించే సమాజ సేవకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తల పేర్లతో ప్రభుత్వ పథకాలను అమలు చేయడం హర్షణీయమని జనసేనపార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖలో పథకాలను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ, అబ్దుల్ కలాం పేర్లతో అమలు చేయాలని నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌కు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో అన్ని పథకాలకు ముఖ్యమంత్రి తన పేరే పెట్టుకొన్నారనీ, ఆ దుస్సంప్రదాయానికి మంగళం పాడి విద్యార్థులలో స్ఫూర్తిని కలిగించే వారి పేర్లతో పథకాలు అమలు మంచి పరిణామమన్నారు.

కార్మికులను ఐక్యం చేద్దాం: ఏఐటీయూసీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్, నారాయణవనం: కార్మి కులను ఐక్యం చేద్దాం, సమస్యలపై సమరం చేద్దా ం అని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పుత్తూరు డివిజన్ ఏఐటియుసి జనరల్ బాడీ సమావేశం పుత్తూరు అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. సమావేశా నికి మహేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథు లుగా జిల్లా అధ్యక్షులు ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, ప్రధా న కార్యదర్శి రాధాకృష్ణలు హాజరైయ్యారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను శరవేగంగా అమలు పరుస్తు ందని దీనివల్ల బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధి ంచుకున్న కార్మిక చట్టాలను పెట్టుబడి దారులకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి అన్ని రాష్ట్రాల్లో అమ లుకు ప్రయత్నం చేస్తుందని దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఏఐటియుసి ఆధ్వర్యంలో రానున్న కాలంలో పోరాటాలకు సన్నద్ధమవుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్ ,హేమావతి, ముకుంద, రమణ, మారెమ్మ, వెంకట రమణమ్మ, రమేష్, సుబ్రమణి, గోపి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-వరదయ్యపాళ్యం: శ్రీరామచంద్రా మెడికల్ సెంటర్ (ఎస్ఆర్ఎంసి), శ్రీసిటీ ఫౌండేషన్, పాండూరు శ్రీకోదండరామ స్వామి సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వరదయ్యపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల వద్ద నుంచి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. చెన్నై శ్రీరామచంద్రా హాస్పిటల్స్ ప్రత్యేక వైద్య నిపుణుల బృందం ఇందులో వైద్య సేవలు అందించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాగిన శిబిరంలో 369 మందికి వివిధ రకాల వైద్య చికిత్సలు జరిపి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అబ్బూరి నాగుల నాయుడుకి నివాళి

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): టీడీపీ సీనియర్ నాయకుడు, శతాధిక వృద్ధుడు అబ్బూరి నాగులు నా యుడు (101)కి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని నివాళులర్పించారు. ఆదివారం చంద్రగిరి మండలం, భీమవరం పంచాయతీ, చిన్నరామాపురం గ్రామం పాతపాటి వారిపల్లిలో శతాధిక వృద్ధుడు, పార్టీ సీని యర్ నాయకుడు అబ్బూరి నాగుల నాయుడు దశదిన కర్మక్రియలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే, టీడీపీ నాయకులు హాజరై చిత్రపటానికి పుష్పా ంజలి ఘటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, ఎస్.గౌస్ బాషా, రమేష్ రెడ్డి, మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, లోకాద్రి నాయుడు, బాలకృష్ణ నాయుడు, ప్రతాప్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్‌టియు రాష్ట్ర బైలా కమిటీ కన్వీనర్‌గా జగన్‌మోహన్ రెడ్డి

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నంజంపేట ఆంగ్ల ఉపాధ్యాయులు గంగిరెడ్డి జగన్ మోహన్ రెడ్డి ని ఎస్‌టియు రాష్ట్ర సంఘం రాష్ట్ర బైలా కమిటీ కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల సాధనలో తన వంతు కృషి చేస్తానని, జీవో నెంబరు 117ను రద్దు చేయాలని, అమ్మకు వందనం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే అమలు చేయాలని డిమాండు చేశారు.

తెలుగు తమ్ముళ్ల శుభాకాంక్షలు

భీమనేని చిట్టిబాబునాయుడుకి శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమ నేని చిట్టిబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా పలువురు టిడిపి నాయకులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని తూగుండ్రం గ్రామానికి చెందిన తెలుగు తమ్ముళ్లు పార్లమెంట్ టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, మండల క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు శాంత కుమార్, తూగుండ్రం గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి సంపత్ పాలసముద్రంలో అతని నివాసంలో కలిసి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు నరసింహులు నాయుడు, అరుల్ పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి పుష్ప పల్లకి

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని బంగారు తిరుత్తణి కొండపై వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం అనంతరం సోమల పురవీధులలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. గ్రామస్తులు పుష్ప పల్లకి ముందు ప్రదర్శించిన చెక్కభజనలు, కోలాటాలు సాంస్కృతిక కళాకారుల ప్రదర్శనలలు చూపరులను ఆకట్టుకుంది.

నేడు కావిళ్ల చెల్లింపు

ఆడి కృత్తిక సందర్భంగా బంగారు తిరుత్తణి కొండపై వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయం వద్ద సోమవారం పుష్ప కావిళ్ల చెల్లింపు ఉంటుందని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ

ప్రజాశక్తి-సోమల: చౌడేపల్లి మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన బోయకొండ గంగమ్మను దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో ఉదయం 6గంటలకు బారులు తీరారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అమ్మవారిని దర్శించుకోవడానికి మొక్కులు తీర్చుకోవడానికి ముడుపులతో క్యూలైన్లను మహిళలు అధిక సంఖ్యలో వచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో స్కూల్ విద్యార్థులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లును ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు. అర్చకులు గంగిరెడ్డి కృష్ణప్ప, సుధాకర్, రాము, రాజన్న, ప్రసాద్, చిన్న గంగిరెడ్డి ఆలయ సిబ్బంది రామనాథం, వీరకుమార్, కృష్ణారెడ్డి, సుధాకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, సూరి, తాతయ్య పాల్గొన్నారు.

రేపు ఆడికృత్తిక పూజలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని బొమ్మాయిపల్లి పంచాయతీ శ్రీవజ్రాలపురం బోయకొండ గంగమ్మ దేవస్థానం ఆవరణంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దేవస్థానంలో మంగళవారం ఆడికృత్తిక పర్వదినం సందర్భంగా ప్రత్యేక అభిషేక పూజలు చేపట్టనున్నట్లు ఆలయ వంశపార్య ధర్మకర్త రాధమ్మ కృష్ణప్పలు తెలిపారు. స్వామికి ప్రీతిపాతమైన కావడి మొక్కుబడులు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లును పూర్తి చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

'డాలర్స్ దివాకర్ రెడ్డి యువతకు ఆదర్శం'

ప్రజాశక్తి-రామచంద్రాపురం: టీడీపీ సీనియర్ నాయ కులు, ప్రముఖ వ్యాపారవేత్త, డాలర్స్ గ్రూప్స్ అధినేత దివాకర్ రెడ్డి యువతకు ఆదర్శమని టీడీపీ నాయ కులు కె.గిరిధర్ రెడ్డి, రామిరెడ్డి, మధు రెడ్డిలు అన్నా రు. ఆదివారం డాలర్స్ దివాకర్ రెడ్డి 42వ జన్మదిన వేడుకలను సి.రామాపురంలో నాయకులు భారీ కేక్‌ను కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. చంద్రగిరి నియోజకవర్గ గెలుపులో ఆయన కృషి ఎనలేనిదని తెలిపారు. ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి, పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. తల్లిదండ్రులు లేని అనాధ పిల్లలకు అండగా.. పేద విద్యార్థులకు విద్యాభివృద్ధి కోసం ఆర్థిక సహాయాలు చేసి ఆదుకుంటున్నారని కొనియాడారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో రంజిత్ కుమార్ రెడ్డి, తిమ్మాపురం మధురెడ్డి, అమర్నాథ్ రెడ్డి, వెంకీ, కొట్టే నరసింహా రెడ్డి, కొల్లంగుంట మునిరామిరెడ్డి, కొట్టే ధనుంజయ రెడ్డి, కొట్టే గిరిధర్ రెడ్డి, పూజారి అమర్నాథ్ రెడ్డి, సురేష్ రెడ్డి, రవి, ముద్దుకృష్ణారెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యా యత్నం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: భర్తి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించిన సంఘటన శనివారం రాత్రి మండలంలోని కుప్పనపల్లిలో చోటుచేసుకుంది. గుర్తించిన కుటుంబీకులు ఆమెను హుటాహుటిన పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రానికి చెందిన రేఖ(27), కుప్పనపల్లికి చెందిన ఉపేంద్రను పెద్దలు కుదిర్చిన వివాహం 14ఏళ్ల కిందట చేసుకుంది. వీరికి సుస్మిత(13), గిరీష్(4) పిల్లలు ఉన్నారు. తరచూ భర్త వేధించడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అక్కడ పట్టించుకోకపోవడంతో పురుగుల మందు సేవించానని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో మీడియాకు వివరించింది. ప్రస్తుతం ఆమె వైద్యుల పర్యవేక్షణలో ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-పుంగనూరు: అగస్త్రీశ్వర స్వామి ఆలయానికి స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంలో వెళుతూ ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆదివారం యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా.. పుంగనూరు పట్టణం చింతల వీధికి చెందిన సురేష్ కుమారుడు రామ్ చరణ్ (19) తన స్నేహితులు సందీప్, ప్రదీప్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో అగస్త్రీశ్వర స్వామి కొండకు వెళ్తుండగా మార్గమధ్యలోని బండ్లపల్లి క్రాస్ వద్ద వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొన్నది. ఈ ప్రమాదంలో రాంచరణ్ అక్కడిక్కడే మృతి చెందగా, సందీప్ ప్రదీప్‌లకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి తరలించారు.

కారు బోల్తా.. నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-పలమనేరు:

దైవదర్శనానికి వచ్చి కాణిపాకం నుంచి బెంగళూరుకు తిరిగి వెళుతున్న కారు గంగవరం మండలం ఫ్లై ఓవర్ వద్ద బోల్తా పడింది. వివరాల్లోకెళితే.. కర్నాటక రాష్ట్రం బెంగళూరు నుంచి 6మంది భక్తులు తిరుపతికి వచ్చి దర్శనానంతరం కాణిపాకం చూసుకొని బెంగుళూరుకు ఆదివారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణమైయ్యారు. మార్గమధ్యలో గంగవరం మండలం ఫైబోవర్ వద్దకు చేరుకొనే సరికి కారు టైరు పంచర్ అయింది. రన్నింగ్‌లో పంచర్ కావడంతో కారు అదుపు తప్పి మూడు పల్టీలు కొట్టింది. ప్రమాదంలో నలుగురు గాయపడగా వారిని పలమనేరు ఆసుపత్రికి తరలించారు. అందులో యశ్వంత్(10), మోహన్(43)ల పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు వారిని చిత్తూరు ఆసుపత్రికి రెఫర్ చేశారు.

మానవత్వం చాటుకున్న సర్వేయర్

పలమనేరు తహశీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న సర్వేయర్ నరేష్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం గంగవరం ఫ్లైఓవర్ వద్ద చోటుచేసుకున్న ప్రమాదంలో గాయపడిన వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

SRI PADMAVATI MAHILA VISVAVIDYALAYAM, TIRUPATI (WOMEN'S UNIVERSITY)

Nit. No. 2/SPMVV/E.S/2024-25 Date. 24.07.2024

e - Procurment Tender Notice

Tenders are invited for 4 civil works and one electrical work in Sri Padmavati Mahila Visvavidyalayam, Tirupati.

Bid document down loading start date : 29-07-2024 at 3.00 P.M.
Bid document down loading end date : 12-08-2024 at 3.30 P.M.
Last date & time for receipt of bids : 12-08-2024 upto 4.00 P.M.
Price bid (Financial bid) opening date : 13-08-2024 at 11.00 A.M.

Further details can be seen at AP E-procurement plot from in and University Web site www.spmvv.ac.in.

REGISTRAR